క్లుప్తంగా

అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం వర్తింపజేయాలి

మండపేట: సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అర్హులందరికీ వర్తింపజేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. దీపావళి పర్వదినాన ప్రజలకు ఉచిత గ్యాస్ సిలిండర్ కానుకగా ఇస్తారని తెలిపారు. ఈ నెల 29న గ్యాస్ బుక్ చేసుకుంటే అక్టోబర్ 31 వరకూ ఈలోగా ఎప్పుడైనా డెలివరీ పొందవచ్చన్నారు. 29 ఉదయం 10 గంటలకు బుకింగ్స్ ప్రారంభమవుతాయని ఆయన వివరించారు.

రోడ్డు మరమ్మతులకు రూ.4.30 కోట్లు

మండపేట: నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రహదారుల మరమ్మతు పనులకు రూ.4.30 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. తుఫాన్లు, వర్షాలు కురవడం వల్ల మరమ్మతులు చేపట్టినా అవి నిలబడవనే ఉద్దేశంతో పనులు ఇంకా ప్రారంభించలేదన్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉన్నందున మరమ్మతు పనులు మొదలు పెట్టి పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

నేడు నల్లూరులో రెవెన్యూ గ్రామ సభ

కపిలేశ్వరపురం: నల్లూరులో సోమవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించనున్నట్టు తహసీల్దార్ చిన్నారావు ఆదివారం తెలిపారు. గ్రామ సచివాలయంలో నిర్వహించే గ్రామసభలో రెవెన్యూ, అనుబంధ శాఖల అధికారులు హాజరవుతారన్నారు. భూముల రీ సర్వేలో తలెత్తిన సమస్యలపై బాధితులు దరఖాస్తులను అందజేయవచ్చని నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయనున్నట్టు తహసీల్దార్ తెలిపారు. 29న వాకతిప్ప, 30న అంగర, నవంబర్ 1న కోరుమిల్లి, 2న కపిలేశ్వరపురం, 4న తాతపూడి 5న మాచర గ్రామాల్లో భూ యజమానుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని తహసీల్దార్ వివరించారు.

ఘనంగా ఉరుసు గంధోత్సవం



దర్గా వద్ద పూజలు చేస్తున్న భక్తులు

రామచంద్రపురం: పట్టణంలోని వీఎస్ఎం కళాశాల వద్ద గల హజరత్ మెహబూబ్ సుభహానీ దర్గ వద్ద 22వ ఉరుసు గంధోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత గంధపు బిందెతో పట్టణంలో ప్రధాన రహదారిలో గ్రామోత్సవం నిర్వహించారు. దర్గా వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణంతో పాటుగా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వరిలో చివరి దశ కీలకం

కాజులూరు: వరి సాగులో నారుపోసిన దశ నుంచి పంట మాసూళ్లు చేసి గింజలు ఒడ్డుకు చేర్చే వరకూ అన్ని దశలు కీలకమైనవేనని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని మొగలిపాలెం, బందనపూడి, చేదువాడ తదితర గ్రామాల్లో వ్యవసాయాధికారి పంట పొలాలను పరిశీలించి క్షేత్రస్థాయిలో రైతులకు పలు సూచనలు అందించారు. ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లో వరి పంట గింజ గట్టిపడే దశ నుంచి మాసూళ్ల దశకు చేరువలో ఉందన్నారు. 15 నుంచి 20 రోజుల్లో కోతకోసే పరిస్థితి ఉండటంతో కొందరు రైతులు పంటలను అంతగా పట్టించుకోరని అయితే ఈ దశలోనూ పంటపై తెగుళ్లు సోకితే గింజ తేలికగా మారి దిగుబడి తగ్గిపోతుందన్నారు. ఈ చివరి దశలోనూ రైతులు పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తెగుళ్లను గమనించాలని అవసరమైతే వ్యవసాయాధికారులను సంప్రదించి మందులు వాడాలన్నారు.

సినిమాలు



ద్రాక్షారామ

సూర్య సినీమ్యాక్స్	దేవర
శ్రీలక్ష్మి	విశ్వం (2 షోలు), వేట్టయన్ (2 షోలు)

రామచంద్రపురం

రాజగోపాల్	ఇద్దరు
సూర్య మ్యాక్స్ స్క్రీన్‌-1	దేవర
సూర్య మ్యాక్స్ స్క్రీన్‌-2	జనక అయితే గనక
కిషోర్	విశ్వం (2 షోలు), వేట్టయన్ (2 షోలు)

తీరనున్న కక్షిదారుల కష్టాలు

- రామచంద్రపురంలో జిల్లా సెషన్స్ కోర్ట్ బెంచ్
- ఏర్పాట్లు ముమ్మరం చేసిన యంత్రాంగం



జిల్లా కోర్టు బెంచ్ నిర్వహించనున్న, కోర్టు ప్రాంగణం

రామచంద్రపురం: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన జిల్లా సెషన్స్ కోర్టు బెంచ్ ఏర్పాటు ఎట్టకేలకు నెరవేరింది. గత ప్రభుత్వం రామచంద్రపురం కోర్టుల ప్రాంగణంలో అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు బెంచ్ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా జిల్లా సెషన్స్ కోర్టు బెంచ్‌కు సంబంధించిన రికార్డులను బదిలీ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. కాగా ఇప్పటికే జిల్లా కోర్టుకు సంబంధించి జిల్లా జడ్జితో పాటుగా ఇతర అధికారులను సిబ్బందిని నియమించుకునేందుకు అనుమతులు మంజూరయ్యాయి. దీంతో అతి త్వరలోనే రామచంద్రపురంకు జిల్లా కోర్టు బెంచ్ ఏర్పాటు కానుంది.

తీరనున్న కక్షిదారుల కష్టాలు

రామచంద్రపురం పట్టణంలో సబ్ఆర్డినేట్ కోర్టు బ్రిటిష్ పాలనలో ఏర్పాటయింది. తదనంతరం స్థానిక ప్రజాప్రతినిధుల కృషి ఫలితంగా సీనియర్ సివిల్ జడ్జి కోర్టు 1981లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రామచంద్రపురం పరిసర ప్రాంతాల కక్షిదారులు కోర్టుల్లో తమ సమస్యలను పరిష్కరించుకునే వారు. పీడీఎం, సబ్ కోర్టుల్లో పరిష్కారం కాని సమస్యలను జిల్లా కోర్టులో అప్పీలు చేసుకోవాల్సి ఉంటుంది. రామచంద్రపురం, అనపర్తి, అలమూరు సబ్‌కోర్టుల పరిధిలోని కేసులకు సంబంధించి అప్పీలును రామచంద్రపురంలో ఏర్పాటు కానున్న అదనపు జిల్లా కోర్టు సెషన్స్ బెంచ్‌తో అప్పీలు వేసుకునే అవకాశం ఉంటుంది. గతంలో ఆయా ప్రాంతాలకు సంబంధించి రాజమహేంద్రవరం వెళ్లి అక్కడ ఉన్న జిల్లా కోర్టులో అప్పీలు చేసుకోవాల్సి వచ్చేది. రామచంద్రపురంలో జిల్లా కోర్టు ఏర్పాటు కోసం నాలుగు దశాబ్దాలుగా పాటు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న పీడీఎం కోర్టు ప్రాంగణంలో జిల్లా కోర్టును ఏర్పాటు చేసి, పీడీఎం కోర్టును బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

8 మండలాలకు సౌకర్యం

రామచంద్రపురంలో అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు బెంచ్ ఏర్పాటు చేయటం మూలంగా 8 మండలాల ప్రజలకు సౌలభ్యంగా ఉంటుంది. రామచంద్రపురం పరిధిలోని రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట, అనపర్తి కోర్టు పరిధిలోని అనపర్తి, బిక్కవోలు, ఆలమూరు మండల కక్షిదారులకు రాజమహేంద్రవరం జిల్లా కోర్టుకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఈ మేరకు జిల్లా కోర్టు బెంచ్ ఏర్పాటు దిశగా చర్యలు ముమ్మరం చేస్తున్నారు.

ఎన్నో ఏళ్ల కృషి ఫలించింది



కింద కోర్టులో కేసులను జిల్లా కోర్టులో అప్పీలు చేసుకునేందుకు రాజమహేంద్రవరం వెళ్లవలసి వచ్చేది. దాని మూలంగా కక్షిదారులతో పాటుగా న్యాయవాదులకు ఇబ్బందిగా ఉండేది. రామచంద్రపురంలో జిల్లా కోర్టు ఏర్పాటు మూలంగా కక్షిదారులకు, న్యాయవాదులకు సమయం కలసి వస్తుంది. గత నాలుగు దశాబ్దాలుగా జిల్లా కోర్టు కోసం ఎదురు చూస్తున్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు కృషితో ఇక్కడ జిల్లా కోర్టు బెంచ్ ఏర్పాటు కావడం న్యాయవాదులతో పాటుగా, కక్షిదారులకు సౌలభ్యంగా ఉంటుంది. బార్ అసోసియేషన్ తరపున అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– పీఎంఎం వెంకటరమణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, రామచంద్రపురం

రామచంద్రపురంలో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు పరిధిలోని మండలాలకు సంబంధించిన రికార్డులను బదిలీ చేసేందుకు సిద్ధం చేయాలని జిల్లా కోర్టు జడ్జి ఉత్తర్వులను జారీ చేశారు. అతి త్వరలోనే ఎన్నో ఏళ్లుగా ఆశిస్తున్న జిల్లా కోర్టు బెంచ్ రామచంద్రపురం ప్రస్తుతం ఉన్న కోర్టుల ప్రాంగణంలో ఏర్పాటు కానుండటంతో అటు కక్షిదారులు ఇటు న్యాయవాదులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శిథిల వంతెనను పునర్నిర్మించాలి



ఆర్యావటం కురాడ డ్రెయిన్‌పై శిథిలావస్థలో ఉన్న వంతెన

కాజులూరు: ఆర్యావటంలో ముత్తావారి గరువు వద్ద కూరాడ డ్రెయిన్‌పై శిథిలావస్థలో ఉన్న వంతెనను పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ముత్తావారి గరువు నుంచి ప్రధాన గ్రామమైన ఆర్యావటం వెళ్లేందుకు సుమారు 20 ఏళ్ల క్రితం అధికారులు డ్రెయిన్‌పై కాలిబాట వంతెనను నిర్మించారు. నిర్మాణ సమయంలో నాణ్యత లోపం కారణంగా కొద్ది రోజులకే శిథిల దశకు చేరుకుంది. ప్రస్తుతం వంతెనకు ఇరువైపులా రక్షణగోడలు విరిగిపోయి అప్రోచ్‌లు కరిగిపోయి ఉన్నాయి. సైకిల్, బైక్ వంటి వాహనాలు ప్రయాణించాలంటే ఏ మాత్రం వీలు లేకుండా ఉంది. పాదచారులు సైతం తప్పనసరి పరిస్థితుల్లో భయం భయంగా వంతెనపై నుంచి ప్రయాణాలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి వంతెన పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ధనమ్మ మర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధివారి లంకలోని ధనమ్మ మర్రిలోని ధనమ్మతల్లి ఆలయానికి భక్తులు కిటకిటలాడారు. ఆదివారం కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పర్యాటక కేంద్రం కావడంతో మండలంతో పాటు రావులపాలెం, కె.గంగవరం, అయినవిల్లి, అంబాజీపేట, కొత్తపేట తదితర మండలాల నుంచి వచ్చిన పర్యాటకులు క్షేత్రాన్ని సందర్శించారు.

ఆత్మ రక్షణకు కుంగ్ ఫూ, కరాటే శిక్షణ దోహదం



బెల్ట్ టెస్టుల్లో పాల్గొన్న విద్యార్థులు

మండపేట: పట్టణంలోని కాలభైరవ స్వామి ఆలయం వీధిలోని మణికంఠ స్లిమ్ జిమ్ ఆవరణలో కుంగ్ ఫూ బెల్ట్ టెస్టులు నిర్వహించారు. న్యూ డ్రాగన్ చైనీస్ కుంగ్ ఫూ గ్రాండ్ మాస్టర్ పిట్టా రాజబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఈ పోటీలు నిర్వహించారు. రాజబాబు వద్ద శిక్షణ పొంది వైట్ బెల్ట్ నుంచి బ్రౌన్ బెల్టు వరకూ శిక్షణ పొందిన విద్యార్థులకు ఈ టెస్టులు నిర్వహించారు. ఇందులో ఉత్తీర్ణులైన విద్యార్థులకు రాజబాబు చేతుల మీదుగా బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ టెస్టులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను చిలకలూరిపేటలో డిసెంబర్ 8న నిర్వహించే జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీలకు ఎంపిక చేశామని చెప్పారు. ఆడపిల్లల ఆత్మ రక్షణకు కుంగ్ ఫూ, కరాటే విద్యలు ఎంతగానో దోహదపడతాయని విద్యార్థినులు, ఆడపిల్లలకు ఈ విద్యను తల్లిదండ్రులు నేర్పిస్తే మంచిదని విజ్ఞప్తి చేశారు. మానసిక ఉల్లాసానికి, శారీర దారుఢ్యానికి కూడా ఉపయోగపడుతుందన్నారు. పోటీల్లో పి హసీత్, పి సాయి, జి చెర్విక్, ఎల్ సిద్ధుమణిరామ్, చక్రీధరహాస్, ఆర్‌జో వీర్, ఎం రిత్విక్, షాన్ అర్విన్, తేజ హర్షవర్ధన్, అభిరామ్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



డ్వాక్రా మహిళలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మెప్మా ఎండీ ఆదినారాయణ

మండపేట: మెప్మా శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను డ్వాక్రా మహిళలు అందిపుచ్చుకుని స్వశక్తితో ఎదిగి ఆర్థిక స్వావలంబన సాధించాలని మెప్మా ఎండీ ఆదినారాయణ అన్నారు. మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు గొల్లపుంత రామాలయం వద్ద ఆయన డ్వాక్రా గ్రూపుల్లోని మహిళలతో సమావేశం నిర్వహించారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పెండ్యాల సుజాత ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా ఎండీ ఆదినారాయణ అన్నారు. తొలుత ఆయన నవభారతి ఎస్ఎల్ఎఫ్ గ్రూఫ్ సభ్యుల బ్యాంకు లావాదేవీల పుస్తకాలను పరిశీలించారు. తీసుకున్న రుణాలకు సంబంధించి బ్యాంకు వాయిదాలు సక్రమంగా కడుతున్నారా లేదా అనే దానిపై ఆరా తీసి బ్యాంకు బుక్‌లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్పీ మెండు దేవి ఎస్ఎల్ఎఫ్ గ్రూప్ నిర్వహణలో పనితీరు బాగుందని గుర్తించి ఆయన ప్రత్యేకంగా అభినందించారు. 25 మంది సభ్యులతో ఒక సెల్ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. గ్రూప్ సభ్యులంతా కలిసికట్టుగా ఉంటూ ప్రభుత్వం అందించే ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ మోహన్, అల్లాడి కృష్ణకుమారి, మెప్మా సీవోలు అరుణ, వీరలక్ష్మి, ఆర్పీలు, ఎస్ఎల్ఎఫ్ సభ్యులు, నవభారతి గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

వెలుగుల పండుగకు విభిన్న ప్రమిదలు

- ఆకట్టుకుంటున్న వెరైటీ ప్రమిదలు
- వివిధ రకాల ఆకృతుల్లో.. అందుబాటు ధరల్లో లభ్యం



మార్కెట్లో విక్రయానికి ఉంచిన ప్రమిదలు



కొబ్బరికాయ ఆకృతి



స్వాగతం పలుకుతున్నట్లుగా..

రాయవరం: దీపావళి అంటేనే దీపోత్సవం. ఆరోజు దీపాలంకరణతో ప్రతి ఇల్లూ కళకళలాడాల్సిందే. చీకటికి వెలుగులు తెచ్చే పండుగగా..విజయానికి ప్రతీకగా దీపావళిని జరుపుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. దీపం వెలుగు శోభతో పాటు స్ఫూర్తిని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపజేస్తుంది. ఏ ఇంటిలో దీపాలు సమృద్ధిగా వెలుగుతాయో ఆ ఇంట మహాలక్ష్మీ ప్రవేశిస్తుందని వేదాలు చెబుతున్నాయని పురోహితులు అంటున్నారు. దీపావళి పర్వదినాన గృహాలు, వ్యాపార సముదాయాల్లో దీపాలు ఏర్పాటు చేసి లక్ష్మీదేవికి పూజలు నిర్వహించి సాదరంగా ఆహ్వానం పలుకుతారు.

వివిధ ఆకృతుల్లో అందమైన ప్రమిదలు

దీపావళి రోజున ముంగిళ్లలో అందమైన జ్యోతుల తోరణాలు వెలిగించేందుకు వివిధ ఆకృతుల్లో ప్రమిదలు లభిస్తున్నాయి. గతంలో స్థానికంగా తయారు చేసే మట్టి ప్రమిదలు లభ్యమయ్యేవి. ఇటీవల రాజస్థాన్ నుంచి వచ్చిన వివిధ ఆకారాల్లోని దీపాలు, ఇన్‌స్టంట్ క్యాండిల్ ప్రమిదలు, ప్రమిదలపై దేవతామూర్తుల విగ్రహాలతో విక్రయిస్తున్నారు. మామిడి, కొబ్బరికాయ, బాదంకాయ, కలువ పువ్వు, ఏనుగు, వినాయకుడు, లక్ష్మీదేవి తదితర దేవతామూర్తుల విగ్రహాలతో కూడిన ప్రమిదలు ఆకట్టుకుంటున్నాయి. విభిన్న రకాల ప్రమిదలు మార్కెట్లో అందుబాటులో ఉండడంతో ప్రజలు ఆయా దీపాల పట్ల ఆకర్షితులవుతున్నారు. అలాగే దుకాణాల్లో రంగురంగుల విద్యుత్ దీపాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

మట్టి ప్రమిదల దీపాలే ప్రత్యేక ఆకర్షణ

మట్టి ప్రమిదలు లేకుండా దీపావళి పండుగను ఊహించలేము. ఇవి దీపావళికి ప్రత్యేక అతిథులుగా చెప్పవచ్చు. దీపావళి రోజు మాత్రమే ఎక్కువగా ప్రమిదల్లో దీపాలు వెలిగిస్తాం. ఇంటి ముందు రంగు రంగుల పూలతో అలంకరించి పూల మధ్యలో మట్టి ప్రమిదల దీపాలు పెట్టడంతో ఆ ఇల్లు దీపాల కాంతులతో వెలిగిపోతుంది. దీపావళి పండుగ మొదలుకుని కార్తీకమాసం పూర్తయ్యే వరకు ఇంటిని నిత్యనూతనంగా ఉంచేవి ప్రమిదలే. కాలానుగుణంగా ప్రమిదలు కూడా తమ రూపురేఖలను మార్చుకుంటున్నాయి.

మూడు రోజుల ముందుగానే

ఈ నెల 31న దీపావళి పండుగను నిర్వహించుకోనున్న నేపథ్యంలో మార్కెట్లో ప్రమిదలు మార్కెట్లోకి అమ్మకానికి ఉంచారు. ప్రధాన రహదారుల వెంబడి ప్రమిదలను వ్యాపారులు విక్రయిస్తున్నారు. సాధారణ ప్రమిదలు రూ.5 నుంచి రూ.50 వరకు, ప్రత్యేక ఆకృతులున్న దీపాల పంక్తుల ప్రమిదలు రూ.200 వరకు విక్రయిస్తున్నారు.

అందుబాటులో మట్టి ప్రమిదలు



లక్ష్మీ పూజలు దీపావళి పండుగ ప్రత్యేకత. దీపావళి రోజు ఇంటిని దీపాలతో అలంకరిస్తే పండుగకు శోభను కనిపిస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో వివిధ రకాల డిజైన్లు, ఆకృతుల్లో మట్టి ప్రమిదలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి.

– గాదె సత్యవెంకటకామేశ్వరి, గృహిణి, వెదురుపాక, రాయవరం మండలం

కార్తిక మాసమంతా దీపారాధన



ఆశ్వీయుజ బహుళ చతుర్దశి నుంచి కార్తిక మాసమంతా, ఉదయం, సాయంత్రం వేళల్లో మట్టి ప్రమిదల్లో దీపారాధన చేస్తాం. దీపం సౌభాగ్యానికి, సౌశీల్యానికి, సౌజన్యానికి ప్రతీకగా నిలుస్తుంది. కార్తిక మాసంలో ప్రతి రోజు దీపారాధన చేస్తాను.

– ఆర్.కృష్ణమాధురి, చిరుద్యోగి, మండపేట

దీపాలంకరణతో మరింత శోభ



దీపజ్యోతిని పరబ్రహ్మ స్వరూపంగా భావిస్తాం. దీపాలంకరణలో భిన్న ఆకృతుల్లో వచ్చిన ప్రమిదలు దీపావళికి మరింత శోభను తీసుకువస్తున్నాయి. ఈ సారి కూడా కొత్త డిజైన్లలో చూడగానే ఆకట్టుకునే విధంగా ప్రమిదలు వచ్చాయి.

– గిరజాల రూపాదేవి, గృహిణి, ద్రాక్షారామ, రామచంద్రపురం మండలం

మద్యం షాపు తొలగించాలని ధర్నా



మద్యం షాపు తొలగించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

అమలాపురం రూరల్: కొత్తపేట మండలం అవిడి రేవు వద్ద ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన మద్యం షాపును తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం కలెక్టరేట్ ఎదుట మహిళలు ధర్నా చేపట్టారు. అవిడి రేవులోని లేఅవుట్‌లో మూడు స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకుంటామని చెప్పి, తమ ఇళ్ల వద్ద బ్రాందీ షాపు పెట్టి దారులు మూసివేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. రాత్రుళ్లు తమ ఇళ్ల సర్వీస్ వైర్లు కట్ చేసి విద్యుత్ నిలిపివేస్తున్నారని అన్నారు. కొత్త ఇళ్లు నిర్మించుకుంటే వారి అనుచరులతో అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. అక్కడి నుంచి వెళ్లగొట్టాలని తమపై కక్షకట్టి హరిప్రియ అనే గృహిణిపై వెంకట సూర్యనారాయణ, ధనప్రసాద్‌లు దాడి చేశారన్నారు. బ్రాందీ షాపు తొలగిస్తామని అధికారులు హామీలు ఇస్తున్నా, ఇంతవరకూ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు. కొత్త మద్యం పాలసీలో భాగంగా ఈ నెల 16న షాపును ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు టి.నాగవరలక్ష్మి, కుసుమ హరిప్రియ, జిల్లేళ్ల హేమలత, బొక్కా శాంతకుమారి, కుసుమ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

అంబాజీపేట: స్థానిక శ్రీనివాస్ నగర్‌లో వేంచేసిన విజయబేతాళ స్వామి ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. శరన్నవరాత్ర ఉత్సవంలో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆరు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయ బేతాళ స్వామి వాహన మహోత్సవాన్ని భక్తులు, స్థానికులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు, 13 పాలాల యువకులు, పెద్దల సహకారంతో ఘనంగా నిర్వహించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అంబాజీపేట, మాచవరం శ్రీ శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అధికారుల ఫోన్ నంబర్లు

కపిలేశ్వరపురం మండలం

దొరరాజు	సీఐ,మండపేట రూరల్	9440796537
డి.రవికుమార్	ఎస్సై, అంగర పోలీస్ స్టేషన్	9440900770
సాయి చంద్రిక	ఏఈ డ్రెయిన్స్, రామచంద్రపురం	8886066939
వై.వెంకటేశ్వరరావు	డిప్యూటీ ఈఈ, ఆర్అండ్ బీ, రామచంద్రపురం	9440818285
వి.వెంకటరమణ	ఏఈ, ఆర్అండ్‌బీ, మండపేట సబ్ డివిజన్	9440818537
జి.దుర్గాప్రసాద్	ఏపీఎం, ఐకేపీ	9652304198
డేవిడ్‌రాజు	ఎఫ్‌డీఓ, మత్స్యశాఖ	9948029350
కె.రవికిరణ్	ఏపీఓ, ఎస్ఆర్ఈజీఎస్	7702072981
డీపీ రాఘవులు	మండల ఇంజినీరింగ్ అధికారి	9966526720
కామేశ్వరరావ	ఎండోమెంట్ అధికారి	9908792945
భాస్కరరావు	మేనేజర్, ఆర్టీసీ, ఆర్సీపురం డిపో	7382825536
కేడీఎస్ఎస్‌కుమార్	మేనేజర్, ఆర్టీసీ, రావులపాలెం డిపో	9959225537
వెంకటేశ్వరరావు	ఏఎస్‌డబ్ల్యూఓ, సోషల్ వెల్ఫేర్	9492168780
కె.శివనాగమల్లేశ్వరరావు	కార్మికశాఖ అధికారి	9492555059
డీఎస్ఎన్ మూర్తి	ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్	9849352664
నాగేశ్వరరావు	ఎక్సైజ్ సీఐ ఆలమూరు	9701287828
కోటేశ్వరరావు	ఉద్యాన శాఖాధికారి	8712625210

చెకుముకి టాలెంట్ టెస్ట్

మలికిపురం: స్థానిక డిగ్రీ కాలేజీలో వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక కోనసీమ జిల్లా నేతృత్వంలో జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. వేదిక జిల్లా అధ్యక్షుడు జె.సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక జేవీవీ ఉపాధ్యక్షుడు ఎస్.రమేష్ బాబు పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా జిల్లా సైన్స్ ఆఫీసర్ జీవీఎస్ సుబ్రహ్మణ్యం, కాలేజీ కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణ మూర్తి, ఎంఈవోలు విజయశ్రీ, వైవీ సత్యనారాయణ, వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మొహిద్దీన్ పాల్గొన్నారు. టాలెంట్ టెస్టులో సుమారు 50 టీంలు ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్ నుంచి రాశాయి. ఈ పరీక్షల్లో ప్రభుత్వ సెక్టార్ నుంచి వానపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల టీం జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రైవేటు సెక్టార్‌లో కొత్తపేట భాష్యం స్కూల్ టీం జిల్లా ప్రథమ స్థాయిలో నిలిచింది. ఈ రెండు టీంలు రాష్ట్ర స్థాయికి అర్హత సాధించి, త్వరలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లనున్నాయి. వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ పీవీవీ వరప్రసాద్, జిల్లా కల్చరల్ కన్వీనర్ సీహెచ్ తులసీరావు, కాలేజీ ప్రిన్సిపాల్ టీవీవీ సత్యనారాయణ, యూటీఎఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ జనరల్ సెక్రటరీ ఎస్.విశ్వనాథం, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బి.ఝాన్సీబాయి, ప్రముఖులు బి.శ్రీనివాసరావు, సీహెచ్ మల్లేశ్వరరావు, బోణం రాజు పాల్గొన్నారు.

రామచంద్రపురం మండల పంచాయతీ కార్యదర్శులు

గ్రామ పంచాయతీ	పంచాయతీ కార్యదర్శి	మొబైల్ నంబర్
చోడవరం	పి. త్రినాథ్	9866740498
హసన్‌బాద	డి.శ్రీనివాసరావు(ఇంచార్జి)	8790133599
తాళ్లపొలం	పీఈ సుందర్‌లాల్	9908027936
ఉండూరు	డి.శ్రీనివాసరావు	8790133599
ద్రాక్షారామ	పి.సత్యనారాయణ(ఇంచార్జి)	9959213643
వెల్ల	వీఎస్ సుబ్రహ్మణ్యం	9876543812
నెలపర్తిపాడు	పి.రాజు	9491270864
నరసాపురపుపేట	కేవీ శ్రీనివాస్	9493796949
జగన్నాయకులపాలెం	పి. రాజు(ఇంచార్జి)	9491270864
కందులపాలెం	ఎం. నారాయణరెడ్డి	9010557125
వేగాయమ్మపేట	బి. నారాయణాచార్యులు	9492968899
వెలంపాలెం	పి. సత్యనారాయణ	9959213643
వెంకటాయపాలెం	డి. అరుణకుమారి	9701214556
అన్నాయిపేట	ఎ. వెంకటేశ్	8885983334
ఆదివారపుపేట	కె. లక్ష్మణరావు	9494551915
బాపనయ్యచెరువు	జి. మహేష్	8985767615
భీమక్రోసుపాలెం	కె. ప్రసాద్ రెడ్డి	9014991933
ఉట్రుమిల్లి	జి.దుర్గాప్రసాద్	8096536325
తోటపేట	కేవీ రామకృష్ణ	9030806987
కాపవరం	కేవీ శ్రీనివాస్(ఇంచార్జి)	9493796949
మాలపాడు	కె.పెదచిన్నిబాబు	9493639217
ఓదూరు	ఎస్.త్రిచరన్	9553470700
తాడిపల్లి	పి.లక్ష్మీనారాయణ	9666821831
యనమదల	ఎం.భాస్కరరావు	9908280889
ఏరుపల్లి	ఐఎస్ దుర్గాప్రసాద్	9177932534